సి.పి. బ్రౌన్
భాషా పరిశోధన కేంద్రానికి
[illegible] గారి కానుక

# నాడి పట్టుకోవాలంటే!...

పడక మిందనుంచి పైకి లేచే కుందికి యిల్లు ఇంద్రలోకం మాదిర్తో కనపడకుండా పోతే పాయ్యింది. ఇల్లాలన్నా సింగారించుకోక పోతే పాయ్యింది. నవ్వు మొకంతో అయినా కంట పడ్తే ఆకతే ఏరు. అట్టగాకుండా ఎవురి అవతారం వాళ్లదిగా కనపడిందో? ఇంక ఆ కత చెప్పాల్సి అవసరమేలే. ఆపొద్దు ఆ జానడు కొంపలో నిద్దర లేచే కుందికి యాడ సామాన్లు ఆడ చిల్లాపల్లగా పడుండాయి. అది చూసే కుందికి నాకు అరికాలిమంట ఉచ్చికెక్క!

"ఏందమ్మా యిది? కొంపా? కొంపకు పట్నె పీడా? అట్టాబొయ్ చూసి రాబోండి. దీని కన్నా శాపల మార్కెట్టు శానా మేలుగా ఉంటింది. మల్లా యింటి నిండికి మణుసులే. ఏం చేసేదానికి? ఇట్టుండేదెత్తి అట్టా పెట్టేదానికి ఎవురికీ తీరిచావదు. ఎంత మంది చేస్తా వుణ్ణా తెమిలి చావదు. యాడికైనా గబ గబ ఎలబారి చావాలంటే దినమ్మూ యిదే రామాయణం!"

నా కోపాన్ని మా బాశాలి మింద చూపించలేకుండా అత్తమింద కోపం దుత్త మింద చూపించినట్టుగా ఉండ్లా యింట్లో పిలకాయిలు వాళ్ల మింద ఎగిరెగిరి పడ్తావుంటే మా బాశాలి పిలకాయిల్ను ఎనకేసుకోని నా ముందిరి కొచ్చె!

"చిన్న యింట్లో పెద్ద కాపరం చెయ్యమని చెప్పేదానికే ముండాది? ఎవ్వరైనా లేసుగానే చెప్పేస్తారు. చేస్తే గదా తెల్సే దెవుడికైనా. మొగోడికి పాపం బండ్ల మింద వస్తా వుండాదే కోపం. జానడింట్లో అద్దో మూరడు కట్టె తెచ్చి చేతికియ్యండమ్మా!!" అంటా మా బాశాలి లగుసుకుండె.

ఇంకేముండాది? – నోరు పడిపాయ. తలవాలి పాయ. కోపం ఉచ్చులు తెంపుకోని

ఉరికె. బెత్తం శాతపట్టుకున్ణె అయ్యోరి ముందర పిలగాడే నాకన్నా ఎన్నోరెట్లు మేలుగదా?

అయినా తొర తొరగా తెమిలి బయటపడ్తామని సైగ్గా నాపని నేను చేసుకుంటా మా బాశాల్ని చూసీ చూడనట్టుగా చూస్తావుండా.

''అయ్యయ్యో! ఏం పిలకాయిలమ్మా మీరు? ఇంట్లో ఒక మొగోడుండాడే? ఆ మొగోడికి రాతికూసాల మాదిర వాసాలకంగా మీసాలుండాయే? మీసాలుండే మొగోళ్లకు మొయ్యలేనన్ని పన్లుంటాయే? అటుమంటి మొగోడు ఎత్తుగాళ్ల మింద ఎలబారి పోవాల్నే? పాయ్ యాడ కొండల్ను పిండికొట్టాల్నో? యాడ ముల్లెల్ను మూటలకెత్తాల్నో? ఆ మాత్రం గ్రహించలేక పోతే ఎట్టమ్మా? మల్లా సదగతా ఉండారు బియ్యేలు ఎమ్మేలు! ఏయేట్లో ఏసే దానికి? చదివినోడికంటే చాకలోడే మేలన్నారు. ఊరికేనా?!''

మా బాశాలి వాయింపు బిడ్డను గిల్లిపెట్టి తొట్టిని ఊసినట్టుగా మెత్తంగా సాగిపోతా ఉండాది. నేనేం గుడ్డికోణ్ణా? ఆ మాత్రం నాకు అర్తంకాదా? అయినా నోరిస్తే మాటకుమాట పెరిగితింది. ఎలబారేటప్పుడు యవ్వారం ఎత్తుబారం మొత్తుకోళ్లుగా తయారవితింది. అందుకని యినీ యిన్నట్లుగా నాపని నేను చేసుకుంటా ఉండా.

అంతలోనే పోన్ మోగె!

అప్పిటికి స్తానం అయింది. తుండుగుడ్డతో వొళ్లు తుడ్సుకుంటా ఉండా. ఆ తుండుగుడ్డను గబ గబా మొలకు చుట్టుకుంటా పోన్ కాడికి పోతి. పోన్ చేతికెత్తుకుంటి. ఇట్టా ఈ పక్కన మూడిండ్లకు అట్టా ఆ పక్కన ఆరిండ్లకు యినపడేటట్టు 'హలో హలో!' అని అరస్తా వుండా.

''అంత మంచి మొకానికి అర్దసేరు పసుపా? అన్నెట్టు ఈ కొంపకు పోనొగిటి. ఈ యింట్లోనే పోనొగిటుండాదని తెలవాల్నేమో?... ఆ అర్సేది చూడు!...''

మా బాశాలి తనపాటికి తాను గొణుక్కుంటా ఉండాది. నేను అదేం పట్టుచెయ్‌లా. 'హలో హలో!' అని అరస్తానే ఉండా.

''డాక్టరు రామారావుని మాట్లాడుతున్నా!'' అంటా అవతల పక్కనుండి శానా నైస్‌గా యినపడె!

''ఇదేందబ్బాయిది? ఎవ్వురైనా ముక్కునొస్తా ఉండాదని మూతి నొస్తా ఉండాదని యాళాపాళా ఏమీ లేకుండా డాక్టర్లకు పోన్ చేస్తారు. మరి తెల్లారే కాడికి డాక్టరెందుకు పోన్ చేసినాడు?'' అని అనుకుంటానే-

''నిద్దర కండ్లతోనే పోన్! ఏం కత డాక్టర్?'' అని అడిగితి.

''కవి గారికి నమస్కారం!'' అనె. నేను ఎగిరట్టా పడ్తి.

''ఇదేందిది డాక్టర్! దొరికి దొరికి తెల్లారే కాడికి నేనే దొరికినానా? ఇది శానా అన్నాయం. నేను కవినా? ఎవ్వురైనా యింటే శానా ప్రెమాదం!''

''నా మాటంటే మీకు ఎగతాళిగా ఉండాదా?''

''ఎగతాళి కాదు. ఏడుపొస్తా ఉండాది''

''ఎందుకూ?''

''ఇద్దో యిట్టా యిల్లామల్లి మాటలు రొండు గీకేసి వాణ్ణీ యీణ్ణీ కాకాపట్టేసి కాగితాల మింద అచ్చు గుద్దించుకోని కవినైపోయ్‌నందుకు. కవిత్తం అంటే ఏం మాట్లా? దానికెంత చదువుకోనుండాల. ఎంత తెల్సుకోనుండాల. అనుమానంలో పడి అట్టా యిట్టా ఊగులాడకుండా ఎంత తేటగా తెలివిగా చెప్పాల? అట్టా చెప్పే దాంట్లో ఎంత సత్తావుండాల?''

''కలం పట్నోడంతా కవినంటా కాలరెగరేసుకోని వాడెంత? ఈడెంత? అని తిరగతా వుంటే మీకేమయ్యింది? నా మాట కాదు. మీ మాట ఎవురైనా యింటే నవ్విపోతారు. మీరు నిజింగా కవులే!''

''ఎవురన్నా రీమాట?!''

''మేము. అంటే ప్రెజలు!''

''హె హెహె! ప్రెజలా! ప్రెజలంటే ఎవురు? వట్టి శాతగానోళ్లు! తిమ్మిని బమ్మి బమ్మిని తిమ్మి చేస్తారు. ఆ మాటకొస్తే పదిమందిని చంపనిదే వొకడు డాక్టర్ కానట్టు పదిమందిని ఎనకేసుకోక పోతే వాడు కవి గాలేడు.''

''అయితే అప్పుడెప్పుడో అన్నమయ్యను పిచ్చోడు అన్నారు. వేమన్నను ఎర్రోడు అన్నారు. అప్పిటికి వాళ్లు కవులు కానట్టేనా!''

''ఆ! నేనూ ఆడికే వస్తావుండా. వాళ్లు అప్పుడూ కవులే. ఇప్పుడూ కవులే. అన్నమయ్య రాగిరేకుల మింద చెక్కి చెక్కి రాసిపోసె. తల్సుకుణ్ణె యదవెవుడు? వేమన్న అడుగుకొక్క ఆటవెలది పలికె! – ఎవుడో జానపదుడు వదురుకుంటా ఉండాడని. తెల్లోడు తేల్చి చెప్పేదాకా తెలిసినా తెలవనట్టుండి పోలా మనం. ఇప్పుడంటావా? పదిమంది యిర్వై రకాలుగా యిడమర్సి చెప్తా వుంటే వాళ్లను పూలల్లోపెట్టి ఊరేగిస్తా ఉండారు. ఇది యాడైనా అంతే. ఎప్పుడైనా అంతే. ఎవురో అన్నెట్టు తనకు నచ్చెనేని దైవమే అనవచ్చు! లేకయున్న దుమ్ము లేపవచ్చు! అని.''

''ఒరె వొరె! రోగం వొగిటైతే మందొగిటాయనే!''

''అంత పని ఎందుగ్గానీ అసలు కత చెప్పండి.''

''అదే చెప్తా ఉండా. ఈ పొద్దు నిద్దర లేచినా. నిద్దర లేస్తానే పేపరు చేతికి తీసుకుణ్ణా. దాన్ని అట్టా యిట్టా తిప్పిస్తా మల్లిస్తా ఉంటే వచ్చేసింది ఊపు! పట్టేదానికి పగ్గాల్లేకుండా వచ్చేసింది. చేస్తావుండేది మీసావాసం గదా? కవిత్వం రాసేసినా!''

''అమ్మో! అమ్మో! డాక్టరంటే గుండెమోత గుండెకోత ఈ రొండే తెల్సు

నమకుంటా ఉంటి! చూడబోతే గుండెపొంగు కూడ తెల్సినట్టుండాదే? కవిత్తం నొచ్చినా కక్కు వచ్చినా నిలవదంటారు. కానీయండి మరి?''

''ఇద్దో యిట్టమ్మా ఈ మొగోడ్తో? ఆడ యాణ్ణో కొంపలు అంటకపోతా ఉణ్ణెట్టు ఈడె గిరి ఆడపడె. ఈ వెుగలాయి పోకుండాబోతే ఆడ అంతా కాలిబూడ్డి అయిపొయ్యేటట్టు అంగలార్చె. ఇప్పుడేమో తుండగుడ్డ మొలకు చుట్టుకోని తుమ్మ మొద్దు మాదిర్తో కదిలీ మెదలకుండా కాన్వర్సేసన్లో పణ్ణాడు.''

మా బాశాలి కవిత్తం కొంపతీసి డాక్టర్ చెవుల్లో పడ్తే?... గబక్కమని పోన్ మూసి పెట్టేసి ఆ పక్కనుంచి వస్తావుండే కవిత్తం యింటావుండా.

*ఏటేటా ఎక్కడో ఒక చోట*
*ఎందులకీ మహానాడు?*
*ప్రతినిత్యం ప్రతిచోట*
*శ్రుతి మించగ ప్రజలగోడు!*
*పసుపులోన పచ్చదనం*
*స్వర్ణంలో పచ్చదనం*
*ఏదైతే ఏముందని*
*పచ్చదనమె కావాలని*
*పసుపు చొక్కాలు పంచి*
*స్వర్ణయుగపు సోయగాలు*
*భ్రమలు చేసి భువినింపగ*
*అన్నగారి బూటకాలు*
*అవును గదా నాటకాలు!*
*నేను పకపకా నవ్వేసినా!*

నేను నవ్వేకుందికి పాపం! డాక్టర్ ఏమనుకున్నాడో? ఏమో? నోరెత్తలా. కవిత్వం యినిపిస్తే ఏమనాల? బాగుంటే బాగుండాది. లేదంటే లేదు. అని చెప్పాల. అట్టాగాకుండా నవ్వితే? – నవ్వెందుకని అడిగేదానికి ఎవురికి మాత్రం నోరెట్టొస్తిందిలే!

అందుకే నేను–

''డాక్టర్! నీ ఎర్రిగానీ మహానాడు ఎందుకని అడగతా వుండావే? నీ దగ్గిరికి ఎవుడైనా కడుపు నొప్పో కాలు నొప్పో అని యాడస్తా వస్తాడనుకో. అప్పుడు నువ్వేం చేస్తావ్? ఎంటనే బాద మర్సిపొయ్యేదానికి మత్తుమందు యిచ్చేస్తావ్. అంతేగదా? అదే మాదిర యిది గూడా. కరువు కాటకాల్లోపడి ప్రెజలు యాడస్తావుంటే వాళ్ల కన్నీటి తుడుపుగా యిట్టాంటి పనులే చెయ్యాల. దానికే నువ్వంత రాసేస్తే ఎట్టబ్బా?''

డాక్టర్ మారు మాట్లాడకుండా ఫోన్ పెట్టేసె.

ఒక డాక్టర్! నాడి పట్టుకోని రోగాన్ని నిర్ధారించి మొందిచ్చే డాక్టర్ మహానాడు నాడిపట్టుకుంటే నేనేంది? యిల్లు యిట్టుండాది. పెళ్లిట్టా ఉండాది. అని ఆపసోపాలుపడ్తా ఉండానే? నేనేం మణిసిని! అనుకుంటా ఆదరా బాదరా అన్నీ ముగించుకోని ఎలబార్నా.

డాక్టర్ యింజక్సన్ యిచ్చేసినాడు కదా? అది తలకాయకెక్కింది. కడుపులో కలబెట్తా ఉండాది. ఈ దేశింలో ప్రెజలుండారే? నీళ్లు కావాలని అడగతా ఉండారు. కరంటు చాల్లేదని వాపోతా ఉండారు. అప్పులు పుట్టలేదని అవస్త పడతా ఉండారు. చదువుకున్నోళ్లకు ఉద్యోగాలు లేవే? అని అడగతా ఉండారు. అయితే ఎవుడుగూడా మహానాడు జరిపించమని అడగలేదే? అదే ఆలోచించుకుంటా ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి పోతి.

ఒరే! నీ మొకం బయిశారా! యింతేనా నీకు తెల్సింది అన్నెట్టుగా ఆడ కత ఎట్టుండాదంటే? -

''నేను మొగోడిగా పుట్నా. ఈసెణందాక మొగోడుగానే బతికినా. ఇంక బతికి ఏమి లాబం? ఇంత జరిగి పాయ్‌నాక బతికి నేను ఏం పాముకోవాల? అయ్యయ్యో! పోదాం పోదాం అనుకుంటానే పోలేక పోతినే. గాలిగోపరం ఎత్తు ప్రబలు కట్నారంట. ఆ ప్రబల్లో దేముడి పటానికి బొదులుగా అన్న పటాలు సింగారించి నారంట. ఒంటెద్దుబండిలో దర్జాగా కూసోని నా అందాల రాముడు అట్టా ఒక చుట్టు చుట్టి వస్తా వుంటే- చెక్కబజిన లేనా? ఎద్దల పందాలేనా? ముగ్గుల పోటీలేనా? నాటకాలేనా? డ్యాన్సులేనా? చూడాలంటే రొండు కండ్లు చాలవంటనే? - వైకుంటం ఎందుకు దాని ముందర! ఆ వైకుంటంలో అడుగు పెట్లేని జల్మం అదీవొక జల్మమేనా?''

వాడి వొంటిమింద పలం కండ లేదు. మూరడు తుండుగుడ్డ మొలకు లేదు. మణిసి మందు మింద ఉండాడేమో. తలతలా కొట్టుకుంటా పాడి పాడి యాడస్తా ఉండాడు.

వాడికత ఆడికయ్యిందా?

''ఒక దినమా? రొండు దినాలా? నెల దినాలుగా మేపతా ఉండానే. ఎట్టా మేపతా ఉండానో ఆ ఏడుకొండలవాడికే ఎరిక. అల్మసాల్మమయిన జాతిగాదే? కాకిడేగ! కాలిగి కత్తికట్తే ఏటుకొగిటి లెక్కన ఎగిరెగిరి పడాల్సిందే. ఉండాయి. ఉండాయి అంటేనే కడాన లేదనేసిరే కోడిపందాలు. వాళ్ల పాసుగూల!'' అని వగుసుకుంటా మంగల వెంకటేసు చంకలో కోడి పుంజును అదే పనిగా దువ్వతా ఉండాడు.

''వాడా కొండ మింద రాజు ఉండాడే? పైకి అట్టా కనిపించినా బలే దొంగనాయాలుగా ఉండాడు. పిల్సుకోని పోతా. పిల్సుకోని పోతా! అని చెప్తానే ఉండె. వాడిమాట నమ్ముకోనుంటే నాయాలు చెప్పకుండానే చెక్కేసెనే? ఏమయినా రాజంటే వాడే రాజు! అన్న పుట్టినరోజు మొనగాడు పూలమాలేసి కాళ్లమిందనే పడెనంట్నే! - పక్కన నేను గూడా ఉణ్ణుంటే?... దేనికైనా యిచ్చిపెట్టుండాల.''

అన్నకాళ్లమింద పడే అదురుష్టం జారి పొయ్యిందని ఒకడు తనకలాడిపోతా ఉండాడు.

''ఒరే పెట్టమారి నాయాలా! కాళ్లమింద పళ్లేదని కండ్లనీళ్లు పెట్టుకుంటా ఉండావే? నువ్వు మొగోడేనా? మనకూడు మనది. మనగుడ్డ మనది. మణిసి కాళ్లమింద మణిసి పడేధా?... '' వాడి నోట్లో మాట నోట్లోనే ఉండాది.

''ఒరే నీ నోట్లో పురుగులురాలా. ఎంత మాట అన్నావురా? ఆయన మణిసా? కొండమిందుండే వెంకటేస్పిరుడికి యాడుండాదిరా ఆ వైబోగం. ఆయనకు ఉండేది ఒక హుండీ అయితే అన్నకుండేది ఎన్నిరా? నాలుగా! ఒక్క వారానికి అన్న వరుమానం ఎంతో తెల్సా? నలబై ఎనిమిది లచ్చలు. అంత వరుమానం వడ్డికాసుల వాడికి యాడుండాదిరా?''

అన్న అబిమానిగా ఉండాడు. ఒంటిమింద పెగ్గేలేకుండా మాట్లాడ్తా ఉండాడు.

''దేశింలో తినేదానికి తిండిలేదు. తాగేదానికి నీళ్లు లేవు. యాడ చూసినా ఆకలి చావులు. ఆత్మహత్తెలు. ప్రెజలు అలో రామచంద్రా! అని అల్లాడి పోతావుంటే అన్న మెడలో ఏనిగ పూలమాలేస్తే గానీ ఆయనకు నిద్దరపట్లా? అహ! ఎత్తుకోని పాయ్ ఆ యిసికలో కుమ్మరించేసినారు గదయ్యా కోట్లు!''

''ఈళ్లెత్తుకోని పాయ్ యిసికిలో కుమ్మరించేసి నారబ్బా! నిజిమే! మీ వాళ్లేం తక్కువ చేసినారా? తమిళనాడులో కుమ్మరించింది కోట్లుగాదో? – నాకు తెల్సులేరా నువ్వు ఏ పార్టీ మణిసివో?''

''ఒరే అబ్బోడా! యిదేందిరా? యిదొక పనిగా ఈడ నిలబడుకోని యింటా ఉండావే? కొందురట్టంటే కొందురిట్టంటారు. ఎవురు ఎట్టన్నా ప్రెజల నాడి పట్టుకోవాలంటే యిట్టాంటి మహానాళ్లు కావాల్సిందే. సారూపాలే ఏరు. సాబావాల్లో అంతా వొగిటే! అది తెల్లగుడ్డ. యిది పచ్చగుడ్డ!''

ఎదురుంగా నిలబడుకోని ఎట్నోచూస్తా యాదాంతి మాదిరచెప్పక పోతా ఉండాడు. ముత్తారెడ్డన్న!

అవుగదామరి? అన్ని గుడ్డలు ఆ తాను లోటివే గదా? అనుకుంటి! ●